అంధకారంలో అంబాపురం

- వీధి లైట్లకు నోచుకోని వైనం
- అవస్థలు పడుతున్న ప్రజానీకం
- పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు



అంబాపురంలో వీధి లైట్లు లేకపోవడంతో అలుముకున్న చీకట్లు

విజయవాడరూరల్: విజయవాడ నగరానికి అనుకొని ఉన్న అంబాపురం గ్రామంలో ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. గ్రామంలో వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇళ్లల్లో వెలుగుతున్న లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాల్సి వస్తోందంటున్నారు. గోతులు పడి ఉన్న రోడ్లపై రాకపోకలు కష్టంగా ఉందని చెబుతున్నారు. డ్రెయినేజీ కాల్వలు లేక ఎక్కడ మురుగు అక్కడే తాండవిస్తున్నా పాలకులకు మాత్రం చీమకుట్టినట్లు లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరానికి ఆనుకొని ఉండటంతో దొంగల భయం వెంటాడుతోంది. కొద్ది రోజుల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న తరుణంలో ప్రత్యేక తరగతులకు, ట్యూషన్లకు వెళ్లి వచ్చే విద్యార్థులు చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. మరో వైపు వారిని కుక్కల భయం ఆందోళనకు గురి చేస్తోంది. రహదారులపై వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయని, అందరిపై ఎగబడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల కుక్కల దాడిలో గాయపడి పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

కనీస సదుపాయలు నిల్..

గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంబాపురం గ్రామంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ దృష్టి పెట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. మౌలిక సదుపాయాలైన తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ కాల్వల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పైపులరోడ్డును ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో దాదాపు 3,500 కుటుంబాలు నివసిస్తున్నా కనీస సదుపాయలు లేక అవస్థలు పడుతున్నారు. కొత్త వీధి లైట్ల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు విద్యుత్ శాఖ వద్ద లేవని సిబ్బంది చెబుతున్నారు. గ్రామ పంచాయతీ నుంచి వీధి లైట్లను ఏర్పాటు చేయాలి. ఈ మేరకు విద్యుత్ శాఖకు చెల్లింపులు చేస్తే లైట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు అంటున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



పైపులరోడ్డును ఆనుకొని ఉన్న అంబాపురంలో గత కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగక అనేక ఇబ్బందులు పడుతున్నాం. విద్యార్థులు, మహిళలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్ని దఫాలు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– పల్ల సతీష్, గ్రామస్తుడు, అంబాపురం

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి..



అంబాపురం గ్రామంలో కనీస సదుపాయాలు లేక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నా, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాత్రి వేళల్లో రహదారులపై ప్రజలు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణమే వీధి లైట్లు ఏర్పాటు చేయాలి.

– నల్లమోతు చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్

నగదు చెల్లించి ఆన్‌లైన్ రశీదులు పొందాలి



మాట్లాడుతున్న చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ

ఉయ్యూరు: మున్సిపాలిటీలో ఏ పనికైనా సరే నగదు చెల్లిస్తే ఆన్‌లైన్ రశీదులు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) చెప్పారు. మున్సిపాలిటీలో మ్యుటేషన్ మాయ శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనంపై చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ స్పందించారు. కార్యాలయంలో పన్నుల వసూళ్లు, ఆన్‌లైన్ ప్రక్రియ, మ్యుటేషన్ వ్యవహారంపై సమీక్ష చేశారు. చైర్మన్ వల్లభనేని మాట్లాడుతూ ఆన్‌లైన్ రశీదులు ఇవ్వకుండా ఎవరికీ ఎలాంటి సొమ్ము చెల్లింపులు చేయవద్దన్నారు. 38 మంది దరఖాస్తుదారుల వద్ద మ్యుటేషన్ కింద నగదు తీసుకుని మాన్యువల్ రశీదులు ఇచ్చారన్నారు. ఈ వ్యవహారం మూడు నెలల కిందటే తమ దృష్టికి రావటంతో దరఖాస్తుదారులను పిలిపించి ఆన్‌లైన్ రశీదులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఎవరికైనా ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సాక్షి ఎఫెక్ట్

క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలి



పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలని పారిశ్రామిక వేత్త, పాఠశాల కన్వీనర్ అన్నే శివనాగేశ్వరరావు అన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. శివనాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పదో తరగతిలో వచ్చే మార్కుల ఆధారంగానే ఇంటర్, ఇతర కోర్సుల్లో సీట్లు వస్తాయన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.విజయలక్ష్మి, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు బి.అజరయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు పాటించాలి



నున్న(విజయవాడరూరల్): సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నిర్మాణం, నాణ్యత విషయంలో ఉన్నత ప్రమాణాలు పాటించాలని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(నీటి విభాగం) పి.విజయ్‌కుమార్ అన్నారు. నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నందు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్మాణాలు, నాణ్యత అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వర్టుల నుంచి భారీ బ్రిడ్జిలు, బ్యారేజీలు నిర్మించే పనుల్లో నాణ్యత పాటించాలని, ఎక్కడ రాజీ పడరాదన్నారు. పటిష్టమైన నిర్మాణాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్క్రీన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఎస్.కీర్తి, ప్రిన్సిపాల్ సీహెచ్.పరమేశ్వరరావు, డీన్.శివగరాజన్ పాల్గొన్నారు.

గోపాలకృష్ణ ఆలయానికి రూ.లక్ష విరాళం



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వంతెన డౌన్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ గోపాలకృష్ణ ఆలయానికి గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కిలారు వెంకటేశ్వరరావు(బుజ్జి) రూ.1,01,116 లక్షలు విరాళం ఇచ్చారు. గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావుకు నగదు అందజేశారు. వెంకటేశ్వరరావును గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు చాగంటి సాంబశివరావు, లంకే సుబ్బారావు, తెన్నేటి ప్రకాష్, బర్మావత్ వెంకటేశ్వరరావు, గోగం గోపి, గోగం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతకు అభినందన



ఉయ్యూరు: కరాటే పోటీల్లో ఉయ్యూరుకు చెందిన జంపాన సాయి శ్రీవల్లి మరోసారి తన సత్తా చాటింది. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన ఆలిండియా కరాటే -డు చాంపియన్ షిప్ -2025లో పాల్గొన్న శ్రీ వల్లి అండర్-14 45-50 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. డబ్ల్యూ ఎల్‌కెఎఫ్‌ఎస్ కరాటే-డు అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆలిండియా కరాటే-డు చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. కోచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో పోటీల్లో పాల్గొన్న సాయి శ్రీవల్లి విజేతగా నిలిచి ట్రోఫీ గెలుచుకుంది. విజేతను శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థ వ్యవస్థాపకుడు మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ప్రతినిధి అనగాని రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి



యనమలకుదురులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు

పెనమలూరు: యనమలకుదురులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎక్కడా రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఉండరాదన్నారు. మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ విపరీతంగా ఉండే అవకాశాలు ఉన్నందున పోలీసు బందోబస్తు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభోత్సవంలో ప్రమాదాలు, చోరీలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ రోజు రాత్రి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గ్రామ శివారులోనే వాహనాలు పార్కు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకోవటానికి బారికేడ్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, 108 వాహనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసే భక్తులకు ప్రమాదాలు జరగకుండా ఘాట్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీజేలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిషేధమన్నారు. కార్యక్రమంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు సీఐలు వెంకటరమణ, మురళీకృష్ణ, రామారావు, ఆర్ఐ భరద్వాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఆది దంపతుల శాంతి కల్యాణోత్సవం



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆలయంలో కమిటీ సభ్యులు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు విఘ్నేశ్వరపూజ, అఖండ దీపాప్రజల్వన, రుద్రాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం స్వామివారికి చెరకు, తేనెతో కలిపిన డ్రైఫ్రూట్స్‌తో అభిషేకాలు, ఆది దంపతులకు లక్ష పుష్పార్చన జరుగుతుందని చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు సుముహూర్తంలో శాంతి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన, అర్ధరాత్రి 12.01 గంటలకు లింగోద్భవకాలంలో స్వామివారికి అన్నాభిషేకం జరుగుతుందని తెలిపారు. గన్నవరంతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు హాజరై స్వామివారి శాంతి కల్యాణోత్సవాన్ని వీక్షించాలని కోరారు. కమిటీ సభ్యులు కొణసాని నాగేశ్వరరావు, జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని శ్రీనివాసరావు, నర్రా అనిల్‌కుమార్, కాట్రగడ్డ రామశేషు, జాస్తి వెంకటేశ్వరరావు, గూడపాటి సీతారాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న శివాలయాలు

రామవరప్పాడు: ఈనెల 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని రూరల్ మండలం పలు గ్రామాల్లోని శివాలయాలు సిద్ధమవుతున్నాయి. రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయ ప్రాంగణంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, ఎనికేపాడు, నిడమానూరులోని శివాలయాలను విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు.

శివరాత్రి సందర్భంగా వేకువజాము నుంచే ఆలయాలకు వచ్చే భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, ప్రసాదాల వితరణ, మంచినీటి వసతుల కల్పనను ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పేరంటాలమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక మాట్లాడుతూ ఉప ఆలయమైన రామలింగేశ్వస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం అన్నాభిషేకం, రాత్రి స్వామివారికి శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. 27న స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు.

పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి



బాపులపాడులో గృహిణులతో మాట్లాడుతున్న డీపీవో అరుణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడులో చెత్త సేకరణ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణను సోమవారం ఆమె పరిశీలించారు. నిత్యం క్రమం తప్పకుండా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను విడివిడిగా సేకరించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక విజయవాడరోడ్డులో పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న చెత్త సేకరణను స్వయంగా వెళ్లి ఆమె పరిశీలించారు. అక్కడి గృహిణులతో డీపీవో అరుణ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచాలని చెప్పారు. రహదారులపై చెత్త కుప్పలు పేరుకుపోవటంపై పలు హోటళ్ల నిర్వాహకులను ఆమె హెచ్చరించారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే వ్యాపార లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈవోపీఆర్‌డీ కె.లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి ఎస్.అంజన పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మానసిక వికాస కేంద్రం ప్రతినిధులు

ఉంగుటూరు: ఆల్కాహాల్, పొగాకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు అన్నారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి జెడ్పీ హైస్కూల్లో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడితే అనారోగ్యం పాలవడంతో పాటు కుటుంబవ్యవస్థ దెబ్బతింటుందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు. ఇలాంటి సమస్యలు ఉన్న వారి కోసం నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని చెప్పారు. వివరాలకు 94904 92020 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్లు ఎస్‌కే నజ్మా, డి.విజయరాణి, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ముగ్గురికి రిమాండ్

గన్నవరం: గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై రెండేళ్ల క్రితం జరిగిన దాడి కేసులో పోలీసులు, సీఐడీ అధికారులు అరెస్ట్‌ల పరంపరను కొనసాగిస్తున్నారు. తాజాగా ఈ కేసులోని ముగ్గురు వైఎస్సార్ సీపీ నేతలను అరెస్ట్ చేసి విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో సోమవారం హాజరుపరిచారు. వివరాలిలా ఉన్నాయి. ఈ కేసులో ఏ-27, 28గా ఉన్న కైలే శివకుమార్, కై లే ఆదిలక్ష్మి దంపతులను ఆదివారం గన్నవరం పోలీసులు అరెస్ట్ చేసి సీఐడీకి అప్పగించారు. ఈ నేపథ్యంలో ఏ-54గా ఉన్న గన్నవరం మాజీ సర్పంచి నీలం ప్రవీణ్‌కుమార్(బాలు) సోమవారం సీఐడీ అధికారుల వద్ద స్వచ్ఛందంగా లొంగిపోయారు. అనంతరం వీరిని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా జడ్జి వీరికి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: ఉంగుటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలో తరిగొప్పల గ్రామంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జీబీ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరిగొప్పల ఫీడర్ లైనుల మరమ్మతుల నిమిత్తం వెల్దిపాడు, వేంపాడు, తరిగొప్పల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో ప్రముఖ హోమియో వైద్యులు దుభాషి రమేష్, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ విష్ణువర్ధన్‌లు రోగులకు వైద్య సేవలు అందించారు. 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, హోమియో మందులు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ చైర్మన్ వెత్సా వెంకటేశ్వరరావు, కార్యదర్శి నారికమల్లి ప్రసాద్, కోశాధికారి గార్లపాటి రామకృష్ణ, ఆర్యవైశ్య ప్రముఖులు పైడి సుధాకర్, కొనకళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

తాడిగడపలో బైక్ చోరీపై కేసు

పెనమలూరు: తాడిగడపలో బైక్ చోరీ ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో శ్రీనగర్‌కాలువ కట్టకు చెందిన పటమట ఆదినారాయణ ఇంటి వద్ద సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. దీంతో అతని బైక్ ఇంటికి దూరంగా పార్కింగ్ చేసి తాళం వేశాడు. అయితే అతను శనివారం ఉదయం వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. సమీపంలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బైక్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరులో వ్యక్తిపై దాడి చేసిన నలుగురిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు హైస్కూల్ సెంటర్‌లో మూత్రపు అబ్రహం టీ షాపు నిర్వహిస్తున్నాడు. అతని షాపు వద్దకు ఆదివారం సాయంత్రం ఎర్రా అభిషేక్, వెనిగళ్ల ధరనీష్, దినేష్, అరుణ్‌లు వచ్చి షాపు సమీపంలో ఖాళీ స్థలంలో కూర్చుని మద్యం సేవించారు. అబ్రహం షాపు వద్దకు వచ్చి సిగరెట్లు అడుగగా డబ్బులు ఇస్తే సిగరెట్ ఇస్తానని తెలిపాడు. దీంతో నలుగురు వ్యక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అబ్రహంపై విచక్షణా రహితంగా బీరు సీసాలు, కర్రలతో దాడి చేశారు. నలుగురు వ్యక్తులు గంజాయి మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. నిందితులపై పోలీసులు దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నదిలో వెలసిన శివయ్య

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక 15,16 డివిజన్ మధ్యలోని నదీ ప్రాంతంలోని రిటైనింగ్ వాల్ పక్కన వెలసిన శివయ్యను శివరాత్రి ఉత్సవాలకు భక్తులు ముస్తాబు చేస్తున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం శివలింగం, నంది విగ్రహాలు కొట్టుకొచ్చాయని స్థానికులు తెలిపారు. నదిలో విగ్రహాలు కొట్టుకొచ్చిన చోటే వీటిని పూజిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఈ విగ్రహాలను నది నుంచి తీసేందుకు ప్రయత్నించగా క్రేన్‌కు ఉన్న ఇనుప పళ్లు సైతం విరిగిపోయాయని వివరించారు. విగ్రహాలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావుకు మద్దతు



లక్ష్మణరావుకు మద్దతు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

గన్నవరం: ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్. లక్ష్మణరావుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు మద్దతుగా నిలవాలని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక రాయ్‌నగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గన్నవరం, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యులు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, కొమరవల్లి గంగాభవాని, ఉంగుటూరు ఎంపీపీ సరోజిని పార్టీ తరుపున కేఎస్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు లక్ష్మణరావు విజయానికి కృషి చేయాలని కోరారు. మూడు సార్లు ఎమ్మెల్సీగా ఆయన విద్య, వైద్య, ఉద్యోగ, రైతులు, కూలీలు, మహిళలు, మైనార్టీ వర్గాల సమస్యలపై శాసనమండలిలో గళం వినిపించారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే ఇటువంటి నేతలనే పెద్దల సభకు పంపడం సముచితమన్నారు. నియోజకవర్గంలోని పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, మహిళా నేత సూరెడ్డి మణిమ్మ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో నల్లతామర నివారణకు చర్యలు



రైతులతో మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి హరిచంద్

గన్నవరంరూరల్: మామిడిలో నల్ల తామర పురుగుల నివారణతో రైతులు పంట దిగుబడి సాధించాలని హార్టికల్చర్ అధికారి హరిచంద్ రైతులకు సూచించారు. మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో మామిడి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. హరిచంద్ మాట్లాడుతూ.. ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా ఉందన్నారు. అయితే జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రబలిన నల్ల తామర పురుగులు, బూడిద తెగుల కారణంగా పూత మాడిపోవటం, వాడిపోయిందని చెప్పారు. నల్ల తామర పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ ఐదు శాతం 0.4 మిల్లీ లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. కలుపు తీసివేసి ఎండు పుల్లలను తొలగించాలన్నారు. జిగురు అట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. బంగినపల్లి, తోతాపురి రకాల్లో నల్ల తామర పురుగులు, బూడిద తెగులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సరైన మందులు వాడి పంట కాపాడుకోవాలన్నారు. పోషక యాజమాన్యం ముఖ్యమన్నారు. రైతులు, హార్టికల్చర్ సిబ్బంది సహకారం తీసుకోవడంతో పాటు శిక్షణలకు హాజరు కావాలని కోరారు. సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు నల్లూరి కోటేశ్వరరావు, హార్టికల్చర్ అసిస్టెంట్ దీక్ష, రైతులు పాల్గొన్నారు.

వివాహితను వేధించిన వ్యక్తి అరెస్ట్

ఉంగుటూరు: వివాహితను వేధించిన వ్యక్తిని ఆత్కూరు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లికి చెందిన ఓ మహిళ ఈ నెల 21న చిన్న అవుటపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో క్యాటరింగ్ పని చేసేందుకు వెళ్లింది. పని ముగించుకుని అర్ధరాత్రి 12.30గంటలకు ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తోంది. అ సమయంలో అదే గ్రామానికి చెందిన కలపాల కిరణ్ అనే వ్యక్తి తన బైక్‌పైన ఇంటి వద్ద దింపుతానని నమ్మించి ఎక్కించుకున్నాడు. దగ్గర దారి నుంచి తీసుకువెళతానని చెప్పి నిర్మానుష్యంగా ఉన్న ఫ్లాట్స్ వద్దకు తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఊహించని పరిణామానికి గురైన మహిళ అక్కడ నుంచి పారిపోయి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. 22వ తేదీ ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఏఎస్ఐ ఆంజనేయులు నిందితుడిని అదుపులోకి తీసుకుని, బైక్‌ను సీజ్ చేశారు. అనంతరం నిందితుడిని గన్నవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు భావన

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు విజయవాడ క్రీడాకారిణి బి.భావన అర్హత సాధించింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కాలేజీలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న భావన 2018 నుంచి 2024 వరకు పంజాబ్, మధ్యప్రదేశ్, విజయవాడ, భువనేశ్వర్, అహ్మదాబాద్, లక్నోలో జరిగిన పది జాతీయ పోటీల్లో ఏపీ నుంచి పాల్గొని సత్తా చాటింది. భారత అమెచ్యూర్ సాఫ్ట్ టెన్నిస్ సమాఖ్య ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొని పతకం సాధించింది. అనంతరం జరిగిన జాతీయ జట్టు ఎంపిక పోటీల్లోనూ రాణించి, అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించింది. మార్చి 16 నుంచి 22వ తేదీ వరకు నోయిడాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే భారత జట్టులో భావన చోటు దక్కించుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారిణి భావనను సిద్ధార్థ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, కన్వీనర్ శ్రీలలిత్‌ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.మాధవి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.హేమ సోమవారం అభినందించారు.